# 75 ఏళ్ల వృద్ధుడికి క్యాన్సర్ కణతి తొలగింపు

## ఎంఎన్‌జేలో ల్యాప్రోస్కోపీ ద్వారా విజయవంతంగా శస్త్రచికిత్స



ఆపరేషన్ అనంతరం వృద్ధుడితో డాక్టర్ రమేశ్

**సిటీబ్యూరో, నమస్తేతెలంగాణ :** నగరంలోని మెహిందీ నవాజ్‌జంగ్(ఎంఎన్‌జే) ప్రాంతీయ క్యాన్సర్ చికిత్సా కేంద్రం నిరుపేదల రోగులకు ప్రాణం పోస్తోంది. నిరుపేద రోగులకు క్యాన్సర్ చికిత్సలు పెను భారంగా మారిన తరుణంలో ఎంఎన్‌జే క్యాన్సర్ ఆసుపత్రి పైసా ఖర్చు లేకుండా రోగులకు ఊపిరి పోస్తుంది. ఈ క్రమంలోనే 75 సంవత్సరాల వృద్ధుడికి గత నెల 9న వైద్యులు ల్యాప్రోస్కోపీ ద్వారా శస్త్రచికిత్స జరిపి క్యాన్సర్ కణతిని విజయవంతంగా తొలగించారు. వివరాల్లోకి వెళితే...వరంగల్ జిల్లాకు చెందిన సారయ్య(75)గత కొంతకాలంగా పెద్దపేగు క్యాన్సర్‌తో బాధపడుతున్నాడు. ప్రైవేటు ఆసుపత్రుల్లో చూపిస్తే రూ.3లక్షల నుంచి రూ.5లక్షల వరకు ఖర్చవుతుందని చెప్పడంతో బాధితులు నేరుగా మూడు నెలల క్రితం రోగిని ఎంఎన్‌జే క్యాన్సర్ ఆసుపత్రికి తీసుకువచ్చారు. ఈ మేరకు వైద్య పరీక్షలు జరిపిన డాక్టర్లు రోగికి వ్యాధి ముదరడంతో మూడు సైకిళ్ల కీమోథెరపీ చికిత్స అందించారు. ఈ చికిత్స మూడు నెలలు అందించిన తరువాత వ్యాధి తీవ్రత తగ్గిందని గుర్తించిన వైద్యులు గత నెల 9న రోగికి శస్త్రచికిత్స చేసేందుకు ఏర్పాట్లు చేశారు.

**నొప్పి లేకుండా..:** రోగి వృద్ధుడు కావడంతో పాటు ఇతర అనారోగ్య సమస్యలతో బాధపడుతుండడంతో సాధారణ శస్త్రచికిత్స ద్వారా పెద్దపేగుకు ఉన్న క్యాన్సర్ కణతిని తొలగిస్తే రోగి శరీరం తట్టుకోలేదని ప్రముఖ ల్యాపరోస్కోపీ సర్జన్ డాక్టర్ రమేష్ తెలిపారు. సాధారణంగా జరిపే శస్త్రచికిత్సలో 10-12 అంగుళాల మేర శరీరాన్ని కోయాల్సి ఉంటుందని, ఈ శస్త్రచికిత్స వల్ల రోగి కోలుకునేందుకు వారం నుంచి 15రోజుల సమయం పడుతుందని, వీటన్నింటిని దృష్టిలో పెట్టుకుని సారయ్యకు ల్యాప్రోస్కోపీ పద్ధతిలో 9న శస్త్రచికిత్స జరిపినట్లు తెలిపారు.

**కార్పొరేట్‌కు దీటుగా :** కార్పొరేట్‌కు దీటుగా ఎంఎన్‌జే క్యాన్సర్ ఆసుపత్రిలో రోగులకు వైద్యసేవలు అందిస్తున్నందు వల్లే ఈ ఆసుపత్రికి తెలంగాణ రాష్ట్రం నుంచే కాకుండా ఏపీ, మహారాష్ట్ర, కర్నాటక, బీహార్ తదితర రాష్ట్రాల నుంచి కూడా రోగులు చికిత్స కోసం వస్తుంటారని ఆసుపత్రి డైరెక్టర్ డాక్టర్ జయలత తెలిపారు. ల్యాప్రోస్కోపీ వంటి ఆధునిక శస్త్రచికిత్సకు కార్పొరేట్ దవాఖానలో సుమారు రూ.4లక్షల నుంచి రూ.5లక్షల వరకు ఖర్చు అవుతుందన్నారు.

నమస్తే తెలంగాణ హైదరాబాద్
Fri, 02 September 2016
epaper.namasthetelangaana.com/c/12922865